# కాకి

కాకులు ఇంటి నడికొప్పు మీద, చుట్టూ ఉన్న చెట్ల మీద కూర్చుని తిడుతున్నట్లుగా అరుస్తున్నాయి.

ఇంట్లో ముసలమ్మ , ఆమె కూతురు, మనవడు ఉన్నారు.

'కాకులకు కోపం వచ్చింది' అంది ముసలమ్మ. మనవడు ఆశ్చర్యంగా చూశాడు.

'కాకి బలగం ఏడుస్తా ఉంది' అంది అవ్వ. మనవడు చూడడానికి బయటికి పోబోతే పోనీకుండా 'కాకులు పోట్టాటకు వచ్చాయి' అంది అవ్వ తొంగి చూస్తూ.

'ఎవరో కాకిని చంపినట్లున్నారు. మనమే చంపామని వాటి అనుమానం లాగుంది. ఏందో సూత్తా' అంటూ బయటికి వచ్చింది.

పంచదాటి బైటికి వచ్చిన వెంటనే అవ్వను రెండు పక్కల నుంచి రెండు కాకులు వచ్చి, మాడు పగిలేటట్లు తన్నాయి. ఆలస్యం చెయ్యకుండా గిరుక్కున వెనక్కు తిరిగింది అవ్వ. 'కాకులు మా లావు కోపంగా ఉన్నాయి' అంది రేగిన తల చేతులతో అదుంకుంటూ.

ఇంటిముందు తల, కాళ్లు, గోళ్లు, పీకిన కాకి ఈకలు కట్టిన పురికొస పడి ఉంది.

'ఇది ఆడి పనే' అంది అవ్వ.

'ఎవుడాడు?' అన్నాడు మనవడు.

'బండోడు!' అని ప్రకటించింది అవ్వ.

మాదిగల దగ్గర మాత్రమే యాచన చేసి బతికే పదకొండు ఉపకులాలతో పదో ఉపకులంవాళ్లు బండోళ్లు. మొండివాడు రాజుకంటే బలవంతుడు కదా! బండోళ్లు మాపిటేలే అడుక్కొంటారు. ఏమీ తెచ్చుకోరు. చేతులూపుకొంటూ వస్తారు. ఊపుకొంటూ పోతారు. 'అమ్మా! బువ్వ పెట్టు తల్లీ!' అంటారంతే.

అన్నం చేతుల్లో పెట్టాలి. అలా పెట్టిన అన్నాన్ని పడిపోకుండా తింటాడు. కడుపు నిండినా, కలిపి తెచ్చిన అన్నం అయిపోయినా 'అమ్మా నీళ్లు తల్లీ!' అంటాడు. నీళ్లు పోస్తే తాగి వెళ్లిపోతాడు.

మాదిగ పల్లెలో మాపిటేల ఒక్క ఇంటివాళ్లనే బువ్వ అడుగుతాడు బండోడు. ఎప్పుడు తెచ్చి పెడతారోనని ఇంటి ఎదుటే కుందు కూర్చుని చూస్తూ ఉంటాడు. ఇంటి

వాళ్లు వినకగాని, లేకగాని పెట్టకపోతే బండోడితో గొడవే! ఏమీ అనదు, కాని కాకుల్ని ఉసి గొలుపుతాడు.

కాకి నెవరూ చంపరు. తినరు. ఆ నియమం బండోడొక్కడికే లేదు. ఎవరు పన్నిన వలలోనూ కాకిపడదు. కాకి తెలివైన పక్షి. ఉండేలుతో తప్ప దాన్ని కొట్టి చంపటం కుదరదు. ఉండేలు చూస్తే అది అక్కడ ఉండదు.

బండోడు మాత్రం గోలీతో కాకిని సునాయసంగా చంపుతాడు. వాడొక్కడే దాన్నలా చంపగలవాడు. గోలీ చూపుడువేలి కింద అదింపట్టి, వేలు విరుసుకొంటున్నట్లు విసురుతాడు. కాకి కింద పడుతుంది.

ఆ రోజు పొద్దుట ఏ నిద్ర మొకం కాకో వాడి ఎదాన పడింది. వాముల్దొడ్డిలో దాని ఈకలు పీకి, తల, కాళ్లు, గోళ్లు ఈకలతో కలిపి కట్టి ఆ యింటి ముందు పడేశాడు.

దాని అర్థం రాత్రి ఆ యింటి వాళ్లు బండోడికి బువ్వ పెట్టలేదని. వాళ్లిప్పుడైనా అన్నం వండిపెడితే తిని ఈకలు తీసుకుపోయి దూరంగా పారేస్తాడు.

వాడంటే కాకులకు హడలు! వాడిది వాటి రూపమే! తల ముళ్ల కంపలాగా ఉంటుంది. వాడి తల తన్నిన కాకి ఆ కంపలో ఇరుక్కుపోయి, వాడి చేతికి దొరికి ఆహారం అవుతుంది.

వాణ్ణి చూస్తే ఆమడ దూరంలో పారిపోతాయి అవి. కాకుల్ని చంపి, కాల్చి తినే మానవ మాత్రుడు వాడొక్కడే! ఎంత కాకి బలగమున్నా బండోడి ముందు బలాదూరే!

అవ్వ అల్లుడు రోడ్డు పనికి చేబ్రోలు పోయి వారమయింది. వస్తూ వెచ్చాలు తేవాలి. తెస్తేనే తిండీ తీర్థం. నిన్న పొద్దుటి నుంచి వాళ్ళేమీ వండలేదు. మనవడు పుల్నీళ్లు తాగాడు. రాత్రి కూడా పొయ్యి ముట్టించలేదు. కుండెక్కలేదు. రాత్రి బండోడి కేకవిన్నా వినకపోయినా వాళ్లకు ఒకటే. వాళ్ళేం చేయలేరు. బండోడు ఎందుకూరు కుంటాడు? పెట్టగలిగిన రంపు పెట్టి వాముల్దొడ్డి కాడ కాకిని కాల్చుకుంటున్నాడు.

కాకులు ఏడుపు ఆపలేదు. ఎక్కడ కాకీకలుంటాయో అక్కడ హంతకుడున్నట్లు వాటికి అజ. ఇంటిలోంచి మనిషి బయటికి వస్తే దాడి చేయటానికి సిద్ధంగా కూర్చున్నాయి. వాటి కేకలు విని మరిన్ని కాకులు వచ్చి చేరాయి.

శవజాగారం చేస్తున్నట్లు ఇంటి చుట్టూ, ఇంటి మీద, చెట్లమీద, కరెంటు, టెలిఫోను తీగలమీద కూర్చుని గోల చేస్తున్నాయి.

మనవడు, తల్లి, అవ్వ తలుపులు వేసుకొని ఇంటిలోపలే దాక్కున్నారు. కిటికీల మీద కూర్చుని కాకులు లోపలికి చూస్తూ అరుస్తుంటే వాళ్లు కిటికీలు కూడా మూశారు.

అవ్వ ఈ అరుపులకు భయపడటం లేదు. జరగబోయే అనర్థానికి బెదిరిపోతూ ఉంది.

బండోడెక్కడో కాకిని కాల్చి తిని ఉంటాడు. అరక్క ఆరాట పడతా ఉంటాడు. మధ్యాహ్నం కూడు బెట్టకపోతే వాడి ధామ్‌ధూమ్‌లు తట్టుకోవటం కష్టమే! బండోడంతటి రోత బిచ్చగాడు కలికానికి కూడా కానరాడు.

మాదిగపల్లె వాళ్లు ఆ యింటికి మూడిన కీడు తొలగించడానికని కాకుల్ని దూరంగా తోలారు. కాని అవి వెళ్లినట్టే వెళ్లీ మళ్లీ వచ్చి కూర్చుని అరుస్తూనే ఉన్నాయి. వాటిని తోలలేక వచ్చిన వాళ్లు వెళ్లిపోయారు. అవి మాత్రం వెళ్లిపోవటం లేదు. కొత్తవి చేరుతున్నాయి. గుంపు పెరుగుతూ ఉంది. కాకి బలగం ధాటికి, దాడికి తట్టుకోవడం కష్టంగా ఉంది. వాటి బలగం ముందు మాదిగ జాతి బలగం పని చేయలేదు.

కాకి పోట్లాట తొలగిపోవాలంటే బండోడికి బువ్వ పెట్టాలి. అప్పుడు వాడు శాపవిమోచనం కలిగిస్తాడు. ఈకలు తీసేస్తాడు. కాకులు వెళ్లిపోతాయి. బండోడు కాక మరెవరయినా పోయి ఈకలు తీసి అవతల పారేసి వస్తే కాకులు వెళ్లిపోవచ్చు కాని, పోయినవాడు రక్తం కళ్ల జూడకుండా రాలేడు. వాడి కళ్లను పొడుస్తాయి కాకులు.

తగాదా పడ్డ ఇంటి చాయలకు కాకులు రెండో రోజు రాకపోతే ఆ తరం గతించిందాకా ఆ యింటికి ఏ కాకీరాదు. వాలదు. మాదిగపల్లెలో కాకి వాలని ఇల్లంటే అవమానం.

మనవడు రాళ్లతో కొట్టి కాకుల్ని తరిమేస్తానని బయటికి పోబోతూ ఉంటే అవ్వ ఆపి, 'పోతే తిరిగి రాలేవు!' అంది. మనవడు సతికిలబడి పోయాడు.

కాకిగోల నిర్విరామంగా ఉంది. చెవులు పగులుతున్నాయి. సూర్యుడు నడినెత్తి మీద నుంచి దిగిపోయాడు. వాముల్దొడ్డిలోని బండోడు లేచి నిలబడ్డాడు. తలుపులు కిటికీలు మూసి ఉన్న ఇంటి ముందుకు వచ్చాడు.

హంతకుణ్ణి చూసి హడలెత్తినట్లు కాకులు నోరెత్తకుండా కుక్కిన పేనుల్లాగా, కిక్కురుమనకుండా, మౌనంగా నక్కి నక్కి దాక్కున్నాయి.

కాకి మాంసం అరగదు. అందుకే తినరు. చంపితిన్నవాణ్ణి చూసి నోరెత్తని కాకులు నోరూ వాయీ లేని అవ్వని మాత్రం తన్నాయి. ఆ ఇంటి వాళ్లమీద అరుస్తున్నాయి. మెత్తగా ఉంటే కాకికి కూడా అలుసే! బండోడు చేతులు నలుపుకుంటూ, వేళ్లు విరుచుకుంటుంటే ఎక్కడి కాకి అక్కడ లేచిపోయింది. 'అమ్మా! బువ్వ బెట్టు తల్లీ!' అని అతడనగానే అవి మళ్లీ వాలాయి.

ఇంట్లోని ముగ్గురూ విన్నారు. పెట్టలేరు కాబట్టి పలకలేదు.

చెవులు రొద పెట్టేటట్లు అరుస్తున్న కాకులు బండోడు అడుక్కొంటున్నప్పుడు మాత్రం కుట్ర పన్నినట్లు నోరు మూసుకున్నాయి.

వాడంటే భయమో, మాదిగలు బండోడికి కూడు పెడితే వాడు కాకుల్ని కొట్టి చంపితినడని నమ్మకమో, వాడి పక్షాన జేరి వాడికి వంత పాడుతున్నట్లు, వత్తాసు పలుకుతున్నట్లు సంఘీభావం ప్రకటిస్తున్నాట్లు ఉన్నాయి కాకులు.

శత్రువులు కాని ఆ ఇంటివాళ్లను కాకులు తన్నటం వెనక బండోడికి అన్నం పెట్టమని అడగటమే ఉన్నట్లుగా ఉంది. కాకులూ బండోళ్లూ అయినోళ్లా, పగోళ్లా? బండోడికీ, కాకులకీ లోపల్లోపల ఒప్పందం ఏమన్నా ఉందా?

'అడిగేడు, అడగనే అడిగేడు. అవుద్ది, అనుకున్నంతా అవుద్ది' అని అవ్వ ఏడుస్తూ ఉంది. తను బువ్వ పెట్టలేదు. వాడు శాపం పెడతాడు.

బండోడు కాకీకల కట్ట పంచ బొంగుకు కట్టాడు. అరగని కాకి మాంసం ముక్కలు ముక్కలుగా కక్కాడు. కాకి మాంసం కంపు రోత. అరగని, జీర్ణంకాని ముక్కలు మరింత నీసు! ముక్కు పగిలే దుర్గంధం.

కక్కిన కూటికి కాకులు కూడా ఆశపడలేదు. కాకి మాంసం కాకి తినటమా? ఎంత నామర్దా!

బండోడు వెళ్ళిపోయాడు. పొద్దుగూకే ముందు కాకులూ వెళ్లిపోయాయి. వాడు మళ్లెప్పుడూ ఆ యింటికి బిచ్చానికి రాడు.

రేపు ఉదయం మళ్లీ కాకుల గుంపు వస్తే వాడు కక్కిన మాంసం మీద కంపు పోవటానికి మట్టిపోసి కప్పెట్టకూడదు. ఇక ఆ ఇంట్లోకి అడుగు పెట్టకూడదు. కాకీకలు తీయకూడదు. రెండో రోజు కూడా కాకులు వాలిన ఇల్లును పాడుబెట్టి తీరాలి. వాడరాదు ఎవరూ ఉండకూడదు. కక్కుడు మీద మట్టిపోసినా, కాకీకలు తీసేసినా, ఇల్లు పాడు బెట్టకపోయినా అనర్థం. పీనిగ లేస్తుంది.

అన్నం లేక పెట్టలేకపోతే ఇంతపగా? రెండో రోజు కాకులు రాకపోతే మాత్రం అలికి ముగ్గు బెట్టి పొయ్యిముట్టిచ్చి వండొచ్చు. తినొచ్చు. ఉండొచ్చు.

అయితే ఆ యింటి మీద ఇక కాకి వాలదు. బండోడు రాడు. 'అమ్మా! బువ్వ బెట్టు తల్లీ!' అనడు. అది విముక్తే. కాని ఆ విముక్తి శాపం. ఇకదీ కాకి వాలని ఇల్లు. బండోడు బిచ్చం అడగని కొంప. అది అవమానం. అది వెలి. ✿